సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 19 । జూన్ । 2024



సింహ వాహనంపై వెంకన్న

అత్తిలి మండలం ఈడూరులో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో మంగళవారం స్వామికి సింహ వాహన సేవ నిర్వహించారు. 8లో ▸



ముంపు ముప్పు

ఏలూరు చుట్టూ ఉన్న తమ్మిలేరు గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో వరద నీరు ఎగదన్ని నగరాన్ని ముంచెత్తే ప్రమాదం పొంచి ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. 8లో ▸



వేసవి దుక్కులతో లాభాలెన్నో

రైతులు తమ భూముల్లో వేసవి దుక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వీటివల్ల భూసారం పెంచుకోవచ్చని చెబుతున్నారు. 8లో ▸

ఖరీఫ్‌కు భరోసా దక్కేనా?

- పెట్టుబడి సాయం అందేదెప్పుడో?
- రైతుల ఖాతాలకు పీఎం కిసాన్ సాయం జమ
- గత ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా సాయం
- ఏడాదికి రూ. 20,000 పెట్టుబడి సాయం ఇస్తామని చంద్రబాబు హామీ
- కొత్త ప్రభుత్వం నిర్ణయం కోసం రైతుల ఎదురుచూపు



తాడేపల్లిగూడెం రూరల్‌లో సిద్ధమవుతున్న నారుమడి

సాక్షి, భీమవరం: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు కేంద్రం తీపి కబురు అందించింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం నుంచి తొలివిడత సాయంగా మంగళవారం రైతుల ఖాతాలకు రూ. 2 వేలు చొప్పున జమ చేసింది. జిల్లాలోని 85,378 మంది రైతులకు రూ. 17.07 కోట్ల లబ్ధి చేకూరింది. కేంద్ర వాటా విడుదల కాగా సాగు పెట్టుబడుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ముందుగా మాసూళ్లు జరిగిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, పాలకొల్లు, పోడూరు, ఆచంట మండలాల్లో నారుమడులు సిద్ధం చేస్తున్నారు. నవంబరు చివరిలో వచ్చే తుఫానుల బారిన పడకుండా ముందుగానే పంటను ఒబ్బిడి చేసుకునేందుకు జూలై 15 నాటికి నాట్లు పూర్తి చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

సాగుకు ముందే సాయం

గతంలో సాగు పెట్టుబడుల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగు ఆరంభంలోనే పెట్టుబడి సాయం అందిస్తూ అన్నదాతలకు అండగా నిలిచింది. పీఎం కిసాన్ సాయం రూ.6000, వైఎస్సార్ రైతుభరోసా రూ.7500 కలిపి ఏటా రూ. 13,500 మొత్తాన్ని ఖరీఫ్ ఆరంభం, కోతలు, రబీ ఆరంభంలో మూడు విడతలుగా అందించేది. పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా పథకంలో జిల్లాలోని సగటున 1,17,999 మంది రైతులకు గత ప్రభుత్వంలో రూ.796.49 కోట్లు లబ్ధి చేకూరింది. ఏటా మే నెలలోనే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ తొలి విడత సాయం విడుదల చేసేది. దాంతో పాటే వైఎస్సార్ రైతు భరోసా పేరిట రాష్ట్ర ప్రభుత్వం రూ. 5,500 జోడించి మొత్తం రూ.7,500 సాయాన్ని రైతుల ఖాతాలకు జమచేసేవారు. ఎన్నికల కారణంగా ఈ ఏడాది ఆలస్యమైంది. సన్న, చిన్నకారు రైతులకు తొలకరి పెట్టుబడులకు ఈ సాయం కలిసొచ్చేది. ఖరీఫ్ చివరిలో పీఎం కిసాన్ రెండో విడత రూ.2000, రైతు భరోసా సాయం రెండో విడత రూ.2000 కలిపి రూ.4000 మొతాన్ని రైతుల ఖాతాలకు జమ చేసేవారు. రబీ ప్రారంభంలో పీఎం కిసాన్ మూడో విడతగా రూ. 2000 సాయం అందించేవారు.

రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు

ప్రస్తుతం తొలకరి పనులు ముమ్మరమవుతున్న నేపథ్యంలో విత్తనాల కొనుగోలు, నారుమడుల తయారీకి రైతులకు సొమ్ములు అవసరమవుతున్నాయి. గతంలో పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా పథకం కింద మొత్తం రూ.7500 సాయం అందేది. ఇప్పుడు పీఎం కిసాన్ సాయం రూ.2000 మాత్రమే అందింది.

ఎన్నికల నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే రైతన్నకు ఏడాదికి రూ.20,000 అందజేస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్‌లో ప్రకటించారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో పెట్టుబడి సాయంపై ప్రభుత్వ నిర్ణయం కోసం ఖరీఫ్ రైతులు ఎదురు చూస్తున్నారు. పెట్టుబడి సాయం విడుదలపై ఇంకా ప్రభుత్వం నుంచి ప్రకటన విడుదల కాలేదు. తొలకరి సాగులో రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం సాయం అందించాలని కోరుకుంటున్నారు.

గత ఐదేళ్లలో అందించిన రైతు భరోసా సాయం

సంవత్సరం	రైతులు	సాయం (రూ.కోట్లలో)
2019–20	1,09,302	రూ.147.56
2020–21	1,24,664	రూ.168.30
2021–22	1,17,791	రూ.159.02
2022–23	1,13,597	రూ.153.36
2023–24	1,24,645	రూ.168.17

వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు రక్షణ చర్యలు పగడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో ఇరిగేషన్ అధికారులతో సమావేశమై సమీక్షించారు. మొదటి ప్రమాద హెచ్చరిక వరకు ఇబ్బంది లేదని, రెండో ప్రమాద హెచ్చరికలో 13 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తే ఏ ప్రాంతాలు, ఎన్ని కుటుంబాలు ప్రభావితం అవుతాయి, తీసుకోవలసిన ముందస్తు చర్యలపై అధికారులను ఆరా తీశారు. వరద ప్రభావిత ప్రాంతాలైన బాడవ, వైవీలంక, యలమంచిలి లంక, లక్ష్మిపాలెం, కోడేరులంక తదితర గ్రామాల ప్రజల నుంచి వరదలు నియంత్రణకు ఏయే చర్యలు చేపట్టాల్సి ఉంటుందనే సమాచారాన్ని సేకరించాలన్నారు. పెనుగొండ, మొగల్తూరు, ఆచంట, నరసాపురం, యలమంచిలి మండలాల్లోని కొన్ని గ్రామాలకు వరద ప్రభావం ఉంటుందని ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అవుట్ ఫాల్ స్లూయిజ్ మరమ్మతులు, ఏటిగట్ల పటిష్టతకు అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, డ్రైనేజీ ఈఈ ఎంవీవీ కిషోర్, హెడ్ వాటర్ వర్క్స్ నరసాపురం ఏఈ కెవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వాసవీ పంచాయతన క్షేత్రంలో పూజలు



వాసవీ ఆలయంలో అన్నసమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఏలూరు రోడ్డులోని వాసవీ పంచాయతన క్షేత్రంలో వేంచేసియున్న 27 అడుగుల అభయాంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు, అన్నసమారాధన, హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీకోదండరామ భజన సమాజంచే కోలాట భజన జరిగాయి. భక్తులు, ఆర్యవైశ్యులు విశేషంగా పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్యులు పులవర్తి పవన్ కుమార్, వబిలిశెట్టి నటరాజ్, కె.రాము, నున్న బాల త్రిపుర సుందరరావు, భోగవల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో 41 శాతం ఉత్తీర్ణత

భీమవరం: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో జనరల్ స్టూడెంట్స్ 41.38 శాతం ఉత్తీర్ణత సాధించగా ఒకేషనల్ విద్యార్థులు 50.73 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా పరీక్షల నిర్వహణ కన్వీనర్ కె.చంద్రశేఖర్‌బాబు చెప్పారు. జనరల్ విద్యార్థులు 5 ఎయిడెడ్ కళాశాలల్లో 217 మంది పరీక్షకు హాజరుకాగా 79 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 14 ప్రభుత్వ కళాశాలల్లో 381 మందికి 176 మంది, 9 హైస్కూల్ ప్లస్ కళాశాలల్లో 66 మందికి 17, ఇన్‌సెంటివ్ విద్యార్థులు 41 మందికి 23 మంది, 60 ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ కళాశాలల్లో 2,885 మందికి 1,195 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చంద్రశేఖర్‌బాబు వివరించారు. ఒకేషనల్ విద్యార్థులు 5 ఎయిడెడ్ కళాశాలల్లో 70 మందికి 31 మంది, 8 ప్రభుత్వ కళాశాలల్లో 101 మందికి 45 మంది, 23 ప్రైవేటు అన్‌ఎయిడెడ్ కళాశాలల్లో 235 మంది విద్యార్థులకు 130 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

21 నుంచి ఐటీఐ కౌన్సెలింగ్

ఉండి: జిల్లాలోని 2 ప్రభుత్వ, 16 ప్రైవేటు ఐటీఐల్లో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 21 నుంచి షెడ్యూల్ ప్రకారం నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ.శ్రీనివాసరాజు తెలిపారు. అభ్యర్థులు ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 21 ఉదయం 9 గంటల నుంచి 10వ తరగతిలో 10 జీపీఏ నుండి 6.2 జీపీఏ మార్కులు వచ్చినవారు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 6.1 జీపీఏ నుండి 5 జీపీఏ మార్కులు వచ్చిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. 22న ఉదయం 9 గంటల నుంచి 4.9 జీపీఏ అంత కంటే తక్కువ వచ్చిన వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. కౌన్సెలింగ్‌లో సీటు రానివారికి ఓపెన్ కేటగిరీలో 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకురావాలని కన్వీనర్ తెలిపారు. మరిన్ని వివరాలకు ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో నేరుగా గానీ 088162 97093, 96760 99988 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు.

ద్వారకాతిరుమల పంచాయతీలో రూ.2.25 కోట్ల అవినీతి

- పూర్వ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌పై ఆరోపణలు
- కలెక్టర్‌కు డీపీవో నివేదిక



ద్వారకాతిరుమల పంచాయతీ కార్యాలయం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల పంచాయతీ కార్యాలయంలో అవినీతి, అక్రమాలు విస్తుగొలుపుతున్నాయి. పంచాయతీలో అక్రమాలు జరిగాయని, కారణమైన పంచాయతీ కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త ఈ ఏడాది జనవరిలో స్పందనలో ఫిర్యాదు చేసింది. దీనిపై కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా పంచాయితీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌ను విచారణకు ఆదేశించారు. ఫిబ్రవరి 17న విచారణ చేపట్టిన డీఎల్‌పీఓ రజావుల్లా పంచాయితీ కార్యాలయంలోని వసూళ్లు, జమలు, ఖర్చుల రికార్డులను పరిశీలించడంతో పాటు, ఫిర్యాదిదారు అముక్త నుంచి, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఈఓపీఆర్డీ ఏవీ సుబ్బారాయన్‌ల నుంచి వివరాలు సేకరించి, వారి స్టేట్‌మెంట్లను రికార్డ్ చేశారు. విచారణ నివేదికను ఏప్రిల్ 26న డీపీఓకు సమర్పించారు. విచారణ పూర్తయి రోజులు గడుస్తున్నా ఇంకా బాధ్యులపై చర్యలు ఎందుకు చేపట్టలేదని ఫిర్యాదిదారు పలుమార్లు పంచాయతీ అధికారులను ప్రశ్నించింది. తనకు విచారణ నివేదిక ఇవ్వాలని సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసింది. ఈ క్రమంలో అముక్తకు మంగళవారం పంచాయతీ అధికారులు విచారణ నివేదికను అందజేయడంతో అసలు నిజాలు బయటపడ్డాయి. పంచాయితీ నిధులను ఇద్దరు అధికారులు, సర్పంచ్ దుర్వినియోగం చేసినట్టు అధికారులు తమ విచారణలో తేల్చారు. 2019 జులై 27 నుంచి ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న ఎల్.వెంకటేశ్వరరావు రూ.1,43,44,700, 2019 జులై 10 నుంచి 2021 ఏప్రిల్ 2 వరకు ఎంపీడీవోగా ఉన్న ఎస్.ఆశీర్వాదం రూ.20,60,611, 2021 ఏప్రిల్ నుంచి సర్పంచ్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.స్వర్ణలత రూ.61,28,511 వెరసి రూ. 2,25,33,822 దుర్వినియోగం చేసినట్టు అధికారులు నిర్ధారించారు. ఏరియల్ డిమాండ్, బిల్ కలెక్షన్ (ఇంటి పన్నులు, కుళాయి ఫీజులు), చిట్టా, వ్యక్తిగత కుళాయిలకు సంబంధించి విరాళాలు సేకరించిన రిజిస్టర్లు, లైసెన్స్ ఫీజుల డిమాండ్, అధికారిక, అనధికారిక లే అవుట్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించలేదని గుర్తించారు.



ఎల్.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి



ఎస్. ఆశీర్వాదం, పూర్వ ఎంపీడీవో



కుంటం స్వర్ణలత, గ్రామ సర్పంచ్

‘నేను బడికి పోతా’కు శ్రీకారం



భీమవరంలో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న డీఈవో నాగమణి తదితరులు

భీమవరం: పేదలకు నాణ్యమైన విద్యనందించడానికి గత ప్రభుత్వం అనేక పథకాలను అమలుచేసింది. ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించడానికి మనబడి నాడు–నేడు పథకం ద్వారా ప్రవేటు పాఠశాలలకు ధీటుగా సౌకర్యాలు కల్పించింది. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో ‘నేను బడికి పోతా’ కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. మధ్యలో బడిమానేసిన 6 నుంచి 14 ఏళ్ల పిల్లలను తిరిగి చేర్పించడం, వారికి ప్రభుత్వం సమకూర్చే స్టూడెంట్ కిట్స్ అందించడం, విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సహకారంతో ఇంటింటికీ తిరుగుతూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. వచ్చే నెల 12 వరకూ ప్రత్యేక డ్రైవ్ కొనసాగనుంది. దీనికి జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులతో కమిటీలు నియమిస్తారు. భీమవరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి పర్యటించి బడిబయట ఉన్న పిల్లల తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించడానికి కృషిచేశారు. జిల్లా కమిటీలో డీఈఓ, సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ చైర్మన్‌గా, ఏపీసీ మెంబర్ కన్వీనర్‌గా, కార్మిక శాఖ డీసీ, ఐటీడీఏ, ఐసీడీఎస్ పీఓలు, ట్రైబల్, సోషల్, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ డీడీలు, ఎస్సీ ఎల్పీ డీడీ, మెప్మా పీడీ, డీవైఈఓ తదితరులు సభ్యులుగా ఉంటారు. మండల కమిటీలో ఎంఈవో మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఎంపీఈవో చైర్మన్‌గా, తహసీల్దార్, ఐసీడీఎస్ సీడీపీఓ, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం, డీఎల్ఎంటీ తదితరులు సభ్యులుగా ఉంటారు.

సమన్వయంతో నిర్వహిస్తాం

నేను బడికి పోతా ప్రత్యేక కార్యక్రమం జూలై 12 వరకు జరుగుతుంది. 6 నుంచి 14 ఏళ్ల వయసు బడి బయట పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి. షెడ్యూల్ ప్రకారం సమగ్ర శిక్ష, కార్మిక శాఖ, ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖలతో కలిసి నిర్వహిస్తాం.

– పి.శ్యామ్‌సుందర్, సమగ్ర శిక్ష, జిల్లా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్

విజయవంతానికి కృషి చేయాలి

ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎం, ఉపాధ్యాయులు సమష్టి కృషితో నేను బడికి పోతా కార్యక్రమం విజయవంతం చేయాలి. బాధ్యత తీసుకుని, షెడ్యూల్ ప్రకారం సవ్యంగా నిర్వహించాలి. ఉపాధ్యాయులు, ఉద్యోగులంతా సమన్వయంతో పనిచేస్తే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చు.

– వై.చంద్రశేఖర్, ఎస్ఎస్ఏ సీఈఓ, భీమవరం

రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ అభినందనలు

భీమవరం (ప్రకాశంచౌక్): మంగళవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు వారిని అభినందించారు. ఇక నుంచి పాలనపరమైన పనులు చేపట్టాల్సి ఉంటుందని, ఇదే స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి సహాయ సహకారాలు అందించాలన్నారు. జాయింట్ కలెక్టరు సీవీ ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, భీమవరం ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు, తణుకు మున్సిపల్ కమిషనరు బి.వెంకట రమణ, తాడేపల్లిగూడెం ఆర్డీవో కె.చెన్నయ్య, కెఆర్‌సి డిప్యూటీ కలెక్టరు బి.శివనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం: జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణి కె.శోభారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రీ మెట్రిక్ వసతి గృహాలు మొత్తం 22 ఉండగా వాటిలో 1,900 ఖాళీలు ఉన్నాయన్నారు. బాలురు 700, బాలికలు 1,200 మంది చేరేందుకు అవకాశముండగా 13 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో 1,100 ఖాళీలకు బాలురు 500, బాలికలు 600 మంది చేరేందుకు అవకాశముందని వివరించారు.

● రాళ్లు కాదు ఉప్పే



వీటిని చూసి కొండ రాళ్లు అనుకుంటే పొరపాటే. పాకిస్తాన్ సరిహద్దు కశ్మీర్ నుంచి సహజ సిద్ధమైన హిమాలయన్ పింక్ ఉప్పు, నల్ల ఉప్పును పంజాబ్ వాసులు ఇలా నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఈ ఉప్పు గ్యాస్, ఎసిడిటీ, బీపీ, సుగర్, థైరాయిడ్ వ్యాధులకు బాగా పనిచేస్తాయని, కిలో రూ.100కు అమ్ముతున్నామని పంజాబ్‌కు చెందిన దీనాసింగ్ తెలిపారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు

ఉపాధికి మూఢం దెబ్బ

- బలమైన ముహూర్తాలు లేక శుభకార్యాలు వాయిదా
- మంచి ముహూర్తాల కోసం 2025 వరకూ ఆగాల్సిందే
- శుభకార్యాలపై ఆధారపడ్డ రంగాలు డీలా



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ ఏడాది శుభ ముహూర్తాలు అంతగా లేకపోవడంతో శుభకార్యాలపై ఆధారపడ్డ రంగాలు డీలాపడ్డాయి. క్రోధి నామ సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి కొన్ని ముహూర్తాలు ఇలా వచ్చి అలా వెళ్లిపోయాయి. బలమైన ముహూర్తాలకు మరో 6 నెలలు వేచి చూడాల్సిందేనని వేద పండితులు చెబుతున్నారు. మధ్యలో కొన్ని సాధారణ ముహూర్తాల్ని పండితులు నిర్ణయించారు. గత ఏప్రిల్ 9 నుంచి ముహూర్తాలు ప్రారంభమై చైత్రమాసం వరకూ కొనసాగాయి. ఏప్రిల్ 28 చైత్ర మాస చవితి నుంచి జూలై 8 వరకూ (ఆషాఢ శుద్ధ తదియ వరకు) మూఢం కావడంతో గత రెండున్నర నెలల నుంచి వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలకు బ్రేక్ పడింది.

ఆషాఢం బ్రేక్

శూన్య మాసం, మూఢం వస్తూ పోతూ ఉంటాయి. ఆషాఢం ఏటా ఉంటుంది. ఈ ఏడాది ఆషాఢ మాసం జూలై 5 నుంచి ప్రారంభం కానుంది. ఇది ఆగస్టు 5 వరకూ కొనసాగుతుంది. ఈ నెలలో కూడా వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాలు వంటి శుభకార్యాలు చేయరు. అన్న ప్రాసనలు, అక్షరాభ్యాసాలు, నామకరణ మహోత్సవాలు, నూతన వ్యాపారాల ప్రారంభాలు, సీమంతాలు, రిజిస్ట్రేషన్లు వంటి కార్యాలు మూఢంలోని మంచి రోజుల్లో చేసుకోవచ్చని పండితులు చెబుతున్నారు. సెప్టెంబర్ 4 నుంచి మరోసారి శూన్యమాసం వస్తోంది. భాద్రపద మాసం కూడా శూన్యమాసం కావడంతో అక్టోబర్ 3 వరకూ వివాహ శుభకార్యాలకు ముహూర్తాలు లేవంటున్నారు.

బలమైన ముహూర్తాలకు 2025 వరకూ ఆగాల్సిందే..

క్రోధి నామ సంవత్సరంలో బలమైన ముహూర్తాలు కావాలంటే 2025వ సంవత్సరం వరకూ ఆగాల్సిందేనని పండితులు అంటున్నారు. డిసెంబర్‌లో మార్గశిర మాసం వివాహాది శుభకార్యాలకు అనుకూలమే అయినా బలమైన ముహూర్తాలు లేవంటున్నారు. మాఘమాసం జనవరి 30 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో అప్పటి వరకూ ఆగితే మంచిదని చెబుతున్నారు. ఫాల్గుణ మాసంలోనూ వివాహాలకు బలమైన ముహూర్తాలు ఉండడంతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 29 వరకూ శుభకార్యాలకు అనువని చెబుతున్నారు.

ఆగస్టు 7 తర్వాత పెట్టుడు ముహూర్తాలు

శూన్య మాసం, మూఢం నుంచి కొంత ఉపశమనంగా పెట్టుడు ముహూర్తాలు వచ్చే ఆగస్టు 5 నుంచి అందుబాటులోకి వస్తున్నాయి. శ్రావణ మాసం ఆగస్టు 5 నుంచి ప్రారంభమవుతుండగా ఈ నెలలో 5వ తేదీతో పాటు 12, 13, 19, 20, 26, 27 తేదీల్లో మధ్యమ ముహూర్తాలు అందుబాటులో ఉంటాయి.

ఉపాధికి దెబ్బ

ఇంత వరకూ బలమైన ముహూర్తాలు లేక శుభకార్యాలపై ఆధారపడ్డ రంగాలు డీలా పడ్డాయి. ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు, కల్యాణ మండపాల యజమానులు, వస్త్ర వ్యాపారులు, బంగారు ఆభరణాల వ్యాపారులు, కేటరింగ్ సిబ్బంది, వంట మేస్త్రీలు, పురోహితులు, వీడియో, ఫొటోగ్రాఫర్లు, పూల డెకరేషన్ సిబ్బంది, బ్రైడల్ మేకప్ బ్యూటీషియన్లు, ట్రావెల్స్, వసతి రంగాలకు పెద్ద దెబ్బ. ముహూర్తాలు లేని కారణంగా చాలామందికి ఉపాధి కొరవడింది.

బలమైన ముహూర్తమే మేలు



వివాహ బంధం, గృహ ప్రవేశం, ఉపనయనం వంటివి జీవితాంతం ఆనందభరితంగా ఉండాలని కోరుకుని చేసుకునే శుభకార్యాలు. అలాంటి శుభకార్యాలను బలమైన ముహూర్తాలు చూసుకుని చేసుకుంటేనే ఆ బంధాలు గట్టిగా కొనసాగుతాయి. ఈ ఏడాది 54 మాత్రమే బలమైన ముహూర్తాలు ఉన్నాయి.

– గుడిమెట్ల బాలకృష్ణ కిషోర్ శర్మ, పండితావధాని

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి

చింతలపూడి: విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురై ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటాపురం గ్రామానికి చెందిన మద్దెల సురేష్ (35) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలో విద్యుత్ పనులకు వెళుతుంటాడు. మంగళవారం గ్రామంలోని ఒక తోటలో విద్యుత్ మోటారు మరమ్మతు పనులకు వెళ్లగా ప్రమాదవశాత్తూ షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సురేష్‌కు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. సురేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి ఎస్సై కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడుల్లో పట్టుబడ్డ మద్యం, సారా ధ్వంసం

నూజివీడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్ పరిధిలో ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన దాడుల్లో, కేసుల్లో పట్టుబడిన 2,245 లీటర్ల సారా, 2,065 మద్యం బాటిళ్లను, 233 బీర్ బాటిళ్లను మంగళవారం అధికారులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కొఠారి రామకృష్ణ మాట్లాడుతూ మద్యం అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మద్యం, సారాను రవాణా చేసేవారిపై దాడులు చేసేందుకు ప్రత్యేక దళాలు రంగంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

చేతబడి అనుమానంతో పూజారిపై కత్తితో దాడి



108లో వీరాస్వామిని తరలిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో కత్తితో దాడి చేసిన ఘటనలో ఒక పూజారికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్ఎన్‌డీ పేట గ్రామానికి చెందిన జొన్నాడ వీరాస్వామి గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కనకదుర్గమ్మ ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. అయితే వీరాస్వామి చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో అదే గ్రామానికి చెందిన ఏసుబాబు అనే వ్యక్తి వీరాస్వామితో మంగళవారం గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఏసుబాబు వెంట తెచ్చుకున్న తాటాకులు నరికే కత్తితో వీరాస్వామిని పొడవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు వీరాస్వామిని గ్రామంలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా, ప్రాథమిక చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో పోలవరం వైద్యశాలకు, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జొన్నాడ వీరాస్వామి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



తంగెళ్లమూడి వంతెన వద్ద తమ్మిలేరు కాలువలో భారీగా పేరుకుపోయిన గుర్రపుడెక్క

తమ్మిలేరు.. ఇదేం తీరు!

- తమ్మిలేరులో భారీగా పెరిగిన గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు
- నగరం చుట్టూ ఉన్న అన్ని కాలువల్లోనూ ఇదే పరిస్థితి
- ఎగువ నుంచి వరద వస్తే నగరాన్ని ముంచెత్తే ప్రమాదం



అమీనాపేట కాజ్‌వే వద్ద కాలువను ముంచెత్తిన గుర్రపుడెక్క



కొత్తబస్టాండ్ వంతెన వద్ద ఇదీ పరిస్థితి

ఏలూరు నగరం చుట్టూ ఉన్న తమ్మిలేరు కాలువలు గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలతో నిండి నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్నా అధికారులకు పట్టడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో తమ్మిలేరుకు వరద పోటెత్తితే నీరు కిందకు ప్రవహించే వీలు లేదు. దీంతో వరద నీరు ఎగదన్ని నగరాన్ని ముంచెత్తే ప్రమాదం పొంచి ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాల్సిందే.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



ఏలూరు పడమర లాకుల వద్ద తమ్మిలేరులో ఇలా..



తూర్పులాకుల వద్ద పెరిగిన గుర్రపుడెక్క, నాచు



అశోక్‌నగర్ వద్ద తమ్మిలేరు కాలువలో అడవిని తలపిస్తున్న చెట్లు

రైలు నుంచి జారిపడి బిహార్ వాసి మృతి



సుజన్‌మహల్‌దార్ మృతదేహం

ఏలూరు టౌన్/భీమడోలు: ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని భీమడోలు మండలం పాతూరు రైల్వే గేటు సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఏలూరు రైల్వే ఎస్సై డి.నర్సింహరావు చెప్పారు. మృతుడిని బిహార్ రాష్ట్రానికి చెందిన సుజన్ మహల్‌దార్ (24)గా గుర్తించామని, మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ముసునూరు: కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై పి.వాసు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెక్కపల్లికి చెందిన రెడ్డి నరసింహారావు (43) తరచూ కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో సోమవారం కూడా నొప్పి అధికంగా రావడంతో నరసింహారావు తట్టుకోలేక పురుగుమందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు హుటాహుటీన నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పశువుల పునరుత్పత్తిలో పోషణ ముఖ్యం



గేదెల పరిశోధనా స్థానంలో కరపత్రాలను విడుదల చేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో సంతానయోగ్యమైన పాడిపశువుల సంపద రకరకాల పునరుత్పత్తి సమస్యలతో సతమతమవుతోందని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌కే సుధాకర్ అన్నారు. వెంకట్రామన్నగూడెంలోని గేదెల పరిశోధన స్థానంలో మంగళవారం షెడ్యూలు కులాల రైతులకు వ్యవసాయ పరిశోధన మండలి, జాతీయ మాంస పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గేదెల పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.ఆనందరావు మాట్లాడుతూ పశుగ్రాసాలు సాగుచేసి ఖర్చు తగ్గించుకుంటే పాడిపరిశ్రమ లాభసాటిగా ఉంటుందన్నారు. పాడి పరిశ్రమ నిర్వహణలో పునరుత్పత్తి సమస్యల కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. గూడెం ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ బి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ సకాలంలో పాడిపశువులు చూడికట్టి, మేత విషయంలో జాగ్రత్తలు పాటించినట్లయితే పాడిపరిశ్రమ నిర్వహణ లాభదాయకంగా ఉంటుందన్నారు. గరివిడి పశువైద్యకళాశాల పశుపోషణ విభాగాధిపతి పునరుత్పత్తి సమస్యలను ఎలా అధిగమించవచ్చో వివరించారు. గేదెల పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగరాజకుమారి 300 రోజుల పాటు పాడి ఉండే పరిస్థితులను వివరించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పశువుల పునరుత్పత్తి పోషణ ప్రాముఖ్యత సమాచారంతో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

జూలై 20న ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

తణుకు అర్బన్: ది ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ రాజమండ్రి పాలకవర్గం ఎన్నికలు వచ్చేనెల 20వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి వి.కృష్ణకాంత్ మంగళవారం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం వచ్చేనెల 11వ తేదీన నామినేషన్ల స్వీకరణ, 13న ఉపసంహరణ అనంతరం 20వ తేదీన ఎన్నికలు నిర్వహించే విధంగా నోటిఫికేషన్ విడుదలైనట్లు తెలిపారు. ఓటర్ల జాబితాను తయారుచేసేందుకు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 4వ తేదీన తుది జాబితాను ప్రకటించే విధంగా కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు.

సింహ వాహనంపై ఊరేగిన వెంకన్న





ఈడూరులో సింహ వాహనంపై వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామి, ఈడూరులో సింహవాహనంపై గ్రామోత్సవ దృశ్యం

అత్తిలి: ఈడూరులో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారికి సింహ వాహన సేవ నిర్వహించారు. ఉదయం ఇమంది సింహాద్రి అప్పన్న, సాయిదుర్గ దంపతులతో శ్రీస్వామివారికి సుప్రభాతసేవ, మేలు కొలుపు తోమాలసేవ జరిపారు. సాయంత్రం వైఖానస పండితులు వేద పారాయణం చేశారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లను సింహవాహనంపై ఉంచి మేళతాళాల నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి శ్రీవెంకటేశ్వరస్వామి సంబరం జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు పూజాదికాలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఆకుల వెంకటనారాయణరావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం డిక్కీలో రూ.5 లక్షల నగదు చోరీ

భీమవరం: పట్టణంలో ఓ బ్యాంకు వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం డిక్కీలోంచి రూ.5 లక్షలు నగదు ఉన్న సంచి చోరీకి గురైంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మార్టేరుకు చెందిన చీర్ల రవిశంకర్‌రెడ్డి రూ.2.50 లక్షల నగదుతో భీమవరం వచ్చాడు. హౌసింగ్ బోర్డుకాలనీలోని బంధువుల ఇంటికి వెళ్లి మరో రూ.2.50 లక్షల నగదు తీసుకున్నాడు. మొత్తం రూ.5 లక్షలు పట్టణంలోని ఒక బ్యాంకులో జమ చేసేందుకు వెళ్లాడు. అక్కడ రద్దీగా ఉండడంతో మరో బ్యాంకుకు వెళుతుండగా డిక్కీ మూత శబ్దం వినపడింది. డిక్కీ తెరిచి చూడగా అందులో నగదు సంచి కనపడలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బ్యాంకు వద్ద సీసీ ఫుటేజీని పరిశీలించగా బాధితుడు ద్విచక్రవాహనం తీసే కొద్దిపాటి సమయంలోనే అక్కడే ఉన్న ఓ వ్యక్తి డిక్కీని తెరిచి నగదు సంచి తీసుకుని వెళుతున్న దృశ్యాలు కనిపించాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.



వేసవి దుక్కులతో లాభాలెన్నో




గణపవరంలో మెట్టదుక్కు చేసిన పొలం

గణపవరం: రబీ పంట అనంతరం రైతులు వేసవి దుక్కు (మెట్ట దుక్కు)లకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వేసవి దుక్కుల వల్ల ఎన్నో లాభాలు ఉంటాయని, వీటి వల్ల భూసారం పెంచుకోవచ్చునని చెబుతున్నారు. రబీ కోతలు కోసిన తర్వాత పొలాలు పూర్తిగా ఎండిపోయిన సమయంలో మెట్ట దుక్కులు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటాయి. గతంలో వ్యవసాయంలో యంత్రాల వాడకం లేని కాలంలో రబీ కోతలు పూర్తయిన తర్వాత రైతులు ఎడ్లకు నాగలి కట్టి వేసవిలో కనీసం ఒక్కసారైనా మెట్ట దుక్కు చేసేవారు. వర్షాలు కురిసి, కాల్వలకు నీరు వదిలిన తర్వాత మరోసారి దుక్కి దున్నేవారు. ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులు పొలాల్లోకి నీరు చేరిన వెంటనే తొలిసాలు, వారం దాటకుండా మలిసాలు దమ్ములు చేస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో కొంతమంది రైతులు మాత్రమే వేసవిలో మెట్ట దుక్కు చేస్తున్నారు. ప్రస్తుతం కాల్వలకు నీరు వదలడంతో, కొన్ని ప్రాంతాలలో రైతులు నారుమడులు వేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. నాట్లు వేయడానికి ఇంకా సమయం ఉన్నందున రైతులు ఒకసారి మెట్ట దుక్కు చేసుకుంటే మేలు అని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

ఆదిలోనే తెగుళ్ల నివారణ

వేసవి దుక్కులతో ఎన్నో లాభాలు ఉన్నాయి. కలుపు, కేళీల నివారణకు ఇవి దోహద పడతాయి. మొండి జాతికి చెందిన గడ్డి మొక్కలు, ఇతర కలుపు మొక్కల మూలాలు పైకి వచ్చి ఎండకు ఎండిపోవడం వల్ల ఇవి మళ్లీ తిరిగి మొలకెత్తే అవకాశం ఉండదు. మెట్ట దుక్కు వల్ల భూసారం వృద్ధి చెందుతుంది. ట్రాక్టరుకు నాగలికట్టి ఆరు అంగుళాల లోతువరకూ దుక్కు దున్నడం వల్ల పొలంలోని మట్టి పూర్తిగా తిరగబడుతుంది. దీని వల్ల దాళ్వా పంటలో భూమిలోకి చేరి ఉన్న క్రిమికీటకాలు, పురుగులు గుడ్లు బయటకు వచ్చి ఎండల తీవ్రతకు నశించిపోతాయి. ముఖ్యంగా కాండం తొలచుపురుగు, ఆకుముడుత పురుగు, కాండం కుళ్లు తెగులుకు కారకాలైన పురుగులు నేలలో గుడ్లు పొదిగి ఉంచుతాయి. ఇవి తదనంతరం వచ్చే పంటలో మళ్లీ ఆ తెగుళ్ల వ్యాప్తికి కారణమవుతాయి. దీనివల్ల పంటకు నష్టం జరుగుతుంది. దాళ్వా మాసూళ్ల అనంతరం పొలంలో ఉండిపోయిన గడ్డి మట్టిలో కలిసిపోయి, చీకి సేంద్రియ ఎరువులా తయారై భూసారం పెరుగుదలకు దోహదపడుతుంది. తద్వారా ఎరువు, పురుగుమందుల వినియోగం గణనీయంగా తగ్గడంతోపాటు, మంచి దిగుబడులు వచ్చి రైతులకు లాభదాయకంగా ఉంటుందని, రైతులంతా తప్పనిసరిగా మెట్ట దుక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

భూసారం వృద్ధి



వేసవిలో మెట్టదుక్కుల వల్ల రైతులకు ఎన్నో లాభాలున్నాయి. నేల తిరగేయడం వల్ల భూమిలో ఉన్న క్రిమికీటకాలు, కలుపు, కేళీలు పైకి వచ్చి ఎండకు మాడిపోతాయి. నేలపై ఉన్న భూసారం తిరగబడి భూమిలో కలిసి భూసారాన్ని వృద్ధి చేస్తుంది. తద్వారా రసాయనాల వినియోగం తగ్గి రైతుకు పెట్టుబడి ఆదా అవడంతోపాటు, అధిక దిగుబడి లభిస్తుంది.

– యర్రంశెట్టి ప్రసాద్, ఏవో, గణపవరం

కేవీకేలో 'పీఎం కిసాన్' ప్రత్యక్ష ప్రసారం



పీఎం కిసాన్ ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

తాడేపల్లిగూడెం: ప్రధాని నరేంద్ర మోదీ వారణాసిలో ప్రారంభించిన పీఎం కిసాన్ 17వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో మంగళవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు, శాస్త్రవేత్తలు వీక్షించారు. రైతులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని, రైతులు ఆర్థికంగా ఎదగాలని ప్రధాని కోరారు. అనంతరం కేవీకేలో ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ విభాగాల్లో చేపడుతున్న కార్యక్రమాలను శాస్త్రవేత్తలు వివరించారు. వ్యవసాయ విభాగంలో రోడ్ల పథకం, సేంద్రియ సాగు విధానాలు, వరిలో నూతన రకాలు, మినుములో కొత్త రకాలు, యాజమాన్య పద్ధతులపై వివరించారు. కొత్తిమీర రకాలైన సుగుణ, స్థిర సాగు పద్ధతులు, ఎరువుల యాజమాన్యం తెలియజేశారు. ఖరీఫ్ కాలానికి గాను ఆకుమచ్చ తెగులు యాజమాన్యం, సేంద్రియ పద్ధతుల్లో పురుగులు, యాజమాన్య పద్ధతులు, మిరపలో తామర పురుగుల యాజమాన్యం, క్షేత్రస్థాయి పరిశీలనపై రైతులకు వివరించారు. కేవీకే సమన్వయకర్త, విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆర్ఎస్ ప్రసాద్, కేవీకే శాస్త్రవేత్తలు, దీప్తి, దేవీవరప్రసాదరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కోళ్లపర్రులో ఇరువర్గాల ఘర్షణ

ఆకివీడు: కోళ్లపర్రులో సోమవారం రాత్రి ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. గ్రామంలో చర్చి వద్ద కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బల్లలు తొలగింపు విషయమై దళితులు, కాపు వర్గానికి చెందిన వారి మధ్య వివాదం రేగింది. ఐదేళ్ల క్రితమే చర్చి వద్ద బల్లలు వేశామని దళితులు చెబుతుండగా, ఈ ప్రాంతం తమదేనని, బడ్డీ కొట్టు నడుపుకుంటున్నామని కాపు వర్గానికి చెందిన కొంతమంది వాదిస్తున్నారు. కాపు వర్గానికి చెందిన కొంతమంది బల్లలను బద్దలు కొట్టి దౌర్జన్యానికి పాల్పడ్డారని ఫిర్యాదు అందడంతో ఎస్సై నాగబాబు, ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ గ్రామానికి వెళ్లి పరిశీలించారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఘర్షణలకు దిగవద్దని ఇరువర్గాలను హెచ్చరించారు.

20న కేఆర్ పురం ఐటీడీఏలో జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): కేఆర్ పురంలో ఐటీడీఏ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియపారు. తిరుపతి జిల్లా శ్రీసిటీలోని మాండ్‌లెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (కాడ్బెరి చాకెలెట్ తయారీ) కంపెనీ ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారన్నారు. ఈ కంపెనీలో టీం మెంబర్ ట్రైనీగా పనిచేయుటకు ఇంటర్ మొదటి ప్రయత్నంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, 18–21 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలో అర్హత సాధించిన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల జీతం, ఉన్నత చదువులకు కూడా సహకారం, సబ్సిడీపై ఇతర సదుపాయాలు కల్పిస్తారన్నారు. అలాగే శ్రీ సిటీలోని అపోలో టైర్స్ సంస్థలో ఉద్యోగం కోసం డిగ్రీ/డిప్లొమా/బీటెక్‌లో 2020 నుంచి 2024 మధ్య కాలంలో ఉత్తీర్ణత పొందిన 18–23 సంవత్సరాలు వయస్సు గల అభ్యర్థులు అర్హులన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు నెలకు రూ.16 వేల జీతం, సబ్సిడీపై ఇతర సదుపాయాలు ఉంటాయన్నారు. ఇతర వివరాల కోసం 88868 82032 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పెంకుటిల్లుపై కూలిన తాటిచెట్టు.. బాలికకు గాయాలు

కామవరపుకోట: గొల్లగూడెంలో మంగళవారం వర్షంతో కూడిన ఈదురు గాలులకు తాడిచెట్టు పెంకుటిల్లుపై కూలిన ఘటనలో ఓ బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కామవరపుకోట పంచాయతీ గొల్లగూడెంకు చెందిన నీలపాల సీతామహాలక్ష్మి బంధువులతో కలిసి తన ఇంట్లో ఉండగా, మంగళవారం వర్షంతో కూడిన ఈదురుగాలులు వీచటంతో, ఇంటి పక్కనే ఉన్న తాటిచెట్టు కూలి పెంకుటిల్లుపై పడింది. దీంతో ఇంటి పైకప్పునకు ఉన్న తాటివాసాలు విరిగి వీరిపై పడ్డాయి. ఈ ఘటనలో బంధువు బాలిక సరితకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



జగన్నాథపురం గ్రామంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న బాబ్జీ, రాజేష్

తాడేపల్లిగూడెం రూరల్: కూటమి విజయం సాధించిన సందర్భంగా మంగళవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ, అష్టోత్తర పూజలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జీ), జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేష్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, టీడీపీ నాయకులు ముత్యాల సత్యనారాయణ, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, అడపా ప్రసాద్, వాడపల్లి సుబ్బరాజు, యెరుబండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు



ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కేంద్ర భారీపరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు

తాడేపల్లిగూడెం: నర్సాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ కేంద్ర భారీపరిశ్రమల సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లాలోని ఎమ్మెల్యేలు ఢిల్లీ వెళ్లారు. వర్మ బాధ్యతల స్వీకరణ అనంతరం మర్యాదపూర్వకంగా వర్మతో జిల్లాలోని ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాసు, నాయకర్, పత్సమట్ల ధర్మరాజు, పితాని సత్యనారాయణ, ఆరుమిల్లి రాధాకృష్ణ తదితరులు కలిశారు.

సమస్యలు చెప్పండి పరిష్కరిస్తాం



నందమూరు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: సచివాలయ, పంచాయతీ సిబ్బంది పరిష్కరించలేని సమస్యలను తమ దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నందమూరు సర్పంచ్ శనగన వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని నందమూరులో సచివాలయ, పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకుడు శనగన రాంబాబు, దార్లంక రాము, తాతకుంట్ల శ్రీనివాసరావు, యామన సత్యనారాయణ, అరసాల సుబ్బారావు, ఆరుగొల్లు శ్రీను, అడపా శ్రీను, అడపా రామకృష్ణ, కొప్పిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం అర్బన్: ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, వారికి సకాలంలో బిల్లులు చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సీఐటీయూ జిల్లా నాయకులు ఎమ్. ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు, కె. బేతపూడిలో ఉపాధి హామీ కార్మికులను మంగళవారం సీఐటీయూ నాయకులు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు మే నెల నుంచి బిల్లులు చెల్లించకుండా రెండు పూటల మస్టర్ పేరుతో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు పని చేయించడం, పే స్లిప్పులు, జాబ్ కార్డులు, పనిముట్లు ఇవ్వకపోవడంతో పాటు మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు కల్పించలేదని అన్నారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

పెనుగొండ: రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలు తక్షణం చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెనుగొండ తహసీల్దారు కేవీవీ రోహిణీకి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా రైతులు సార్వా సాగుకు సన్నద్ధమవుతున్నా అమ్మిన ధాన్యం డబ్బులు చేతికందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగానికి ధాన్యం డబ్బు ఎంతో ముఖ్యమన్నారు. సొమ్ము చెల్లించడంతో పాటు విత్తనాలు, ఎరువులు, అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. సార్వాసాగుకు ప్రతి కౌలు రైతుకూ కౌలు కార్డులు అందచేసి, పంట రుణాలు అందించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో సార్వా సాగు ఆకుమడులకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాగునీరు పంట కాలువల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

జూన్‌లోనూ తగ్గేదేలే..

- విశ్వరూపం చూపుతున్న భానుడు
- కానరాని రుతుపవనాలు
- ఎండలతో ప్రజల అవస్థలు



భానుడి ప్రతాపానికి తణుకులో నిర్మానుష్యంగా రోడ్లు

తణుకు: వారం రోజులుగా తణుకులో విచిత్ర వాతావరణం కనిపిస్తోంది. పగటి పూట ఉష్ణోగ్రత అల్లాడిస్తుంటే.. సాయంత్రం మబ్బులు కమ్మి ఆహ్లాదం కలిగిస్తున్నాయి. కాసేపు చిన్నగా వర్షం కురిసినా, ఆ తర్వాత రోజు ఎండ బాదుడు మామూలే. గత సంవత్సరం జూన్ వచ్చిందంటే వర్షాలు కుంభవృష్టిని తలపించాయి. వరుణుడు కరుణించడంతో రైతులు ఉత్సాహంగా రబీ పంటల ద్వారా అధిక దిగుబడులు సాధించారు. అయితే ఈ ఏడాది వరుణుడు మచ్చుకైనా కానరాని పరిస్థితి.

జాడలేని రుతుపవనాలు...

నైరుతి రుతుపవనాలు ఈనెల 3వ తేదీన రాష్ట్రంలో ప్రవేశించినట్టు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం జూన్ 18వ తేదీ వచ్చినా వర్షాలు కానరావడం లేదు. వానలతో చల్లగా ఉండాల్సిన వాతావరణం భానుడు భగభగలతో నిప్పులు కొలిమిలా మారింది. ఏప్రిల్, మే నెలలలో సూర్యతాపంతో అల్లాడిన ప్రజలు జూన్‌లో వర్షాలతో సేదదీరవచ్చని భావించారు. అయితే రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా ఉక్కబోత కూడా తోడవ్వడంతో చిన్న పిల్లలు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పగలు ఉష్ణోగ్రతలు పెరగడంతో రాత్రి పూట కూడా ఉక్కబోత అధికంగా ఉంటోంది. దీంతో ఏసీలు, కూలర్ల వాడకం బాగా పెరిగింది. మంగళవారం ఉష్ణోగ్రత 36 డిగ్రీలు నమోదైనప్పటికీ గాలిలో తేమశాతం 60 శాతం ఉండటంతో ప్రజలంతా అల్లాడిపోయారు. చిరువ్యాపారుస్తులు, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారంతా చెట్ల నీడ వద్దకు వెళ్లి సేదరడం కనిపించింది. మరో మూడు రోజుల పాటు ఎండలు కొనసాగుతాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో ప్రజలందరూ ఆందోళన చెందుతున్నారు.

జ్యూస్ షాపుల వద్ద రద్దీ

తణుకు: ఎండ నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. లస్సీలు, కూల్ డ్రింకులు, జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు, సోడాలు, తాటి ముంజెలు, చెరుకు రసాలకు డిమాండ్ పెరిగింది. ఆయా షాపుల వద్ద క్యూ కడుతున్నారు. పట్టణంలో ప్రధాన రోడ్డులో కలర్ సోడాలు, కొబ్బరి బొండాలు, జ్యూస్ షాపులు, చెరుకు షాపులు, తోపుడు బండ్లపైన కుండ లస్సీలు, తాటి ముంజెల వ్యాపారాలు జోరందుకున్నాయి. ఇదిలా ఉంటే ఉదయం నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడంతో బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యమైన పనులు ఉంటే ఎంత తొందరగా పూర్తి చేసుకుని, ఇంటికి చేరు కుంటున్నారు. మధ్యాహ్నం సమయానికి దాదాపు రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత కూడా ప్రజలు బయటికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట కూడా వేడి, ఉక్కబోతతో అల్లాడిపోతున్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: గుండె సంబంధిత వ్యాధులపట్ల అవగాహన కల్గి ఉండి, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు జరిపించుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శింగులూరి చంద్రశేఖర్ చెప్పారు. మంగళవారం అత్తిలి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో, విజయవాడ వైవీ రావు ఉషా కార్డియాక్ సెంటర్ వారి సౌజన్యంతో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు శింగులూరి చంద్రశేఖర్ తండ్రి ఘంటారావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య పరీక్షా శిబిరంలో 55 మందికి గుండె సంబంధిత పరీక్షలు జరిపారు. వీరిలో 15 మందికి సమస్య ఉన్నట్లు గుర్తించారు. మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం వీరిని విజయవాడ ఆస్పత్రికి రావాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ శీతాల వెంకటనారాయణ, కోశాధికారి బండి గంగాధర్, క్లబ్ సభ్యులు జీఎస్ సూరిబాబు, సంకుబాబూరావు, దాసం బాబ్జి, వి కొండబాబు, వర్ధినీడి వెంకటశివ, యాతం రాంబాబు, బి ప్రవీణ్‌రాయ్, కేవీవీ సత్యనారాయణ, కె సుశీల, వై సుజాత, గొర్లి వెంకట్రావు, బీటీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

తణుకు అర్బన్: తణుకు కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పేర్కొన్నారు. తణుకు కోర్టులో మంగళవారం పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. ఈనెల 29వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకాదగ్గ క్రిమినల్ కేసులతోపాటు ఇతర కేసులు రాజీ చేసేందుకు ఇరుపక్షాలైన కక్షిదారులను సమన్వయం చేసి కేసులను పరిష్కరించే దిశగా పాటుపడాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారులు తమ విలువైన సమయాన్ని, ధనాన్ని కూడా సద్వినియోగపరుచుకోవచ్చని తెలియజెప్పాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కృష్ణ సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పాతర్లంక శ్రీరామ్, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రంజిత్‌కుమార్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏవీ నాగరాజు, చిరంజీవిరావు, తాడి ఆంజనేయులు, ఏపీపీ హనుమంతరావు, పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

కల్యాణ వైభోగం





బల్లిపాడులో వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యాలు

అత్తిలి: బల్లిపాడు గ్రామంలో మదనగోపాలస్వామివారి సన్నిధిలో వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం విష్వక్సేన పూజ అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణం చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీస్వామి, అమ్మవార్లను ఉంచి సన్నాయి మేళంతో గ్రామోత్సవాన్ని జరిపారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తరించారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గారపాటి ధర్మయ్య, ముత్యాల నాగేశ్వరరావు, గారపాటి బాబ్జి, ప్రగడ నాగేశ్వరరావు, ఆకుల రామచంద్రరావు, గారపాటి అశోక్, కసిరెడ్డి అప్పారావు, దాసం ఆదినారాయణరావు, బాడిగ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న విద్యుత్ ఏఈ, సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాతూరులో అరుంధతి పేటలో 100 కేవీ కొత్త అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. పాతూరు వినాయకుడి గుడి వద్ద ఉన్న 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ సరిపోకపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తరుచుగా ఏర్పడుతున్నాయి. పాతురులో మరో ప్రాంతమైన అరుంధతి పేటలో విద్యుత్ సమస్యలు రావడంతో లోడు సరిపోక ట్రిప్ అవ్వడంతో స్థానికులు రాత్రి, పగలు తేడా లేకుండా అనేక ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి పాతూరు అరుంధిత పేట మహిళలు ఇండోర్ సబ్ స్టేషన్ వద్ద అంతరాయాలను తొలగించాలని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక నేతలు సమస్యను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి విద్యుత్ ఏడీఈ ఆకుల సతీష్‌తో మాట్లాడారు. మరో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను అరుంధతిపేటలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో అరుంధతి పేటలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను యుద్ధప్రాతిపదికన మంగళవారం సాయంత్రం స్థానికులతో ప్రారంభించారు. విద్యుత్ సరఫరా జరగడంతో శాసన సభ్యులకు, విద్యుత్ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు వెల్లడించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తణుకు అర్బన్: కరపత్రాలు అందజేస్తున్న వెంకటేశ్వరరావు



తాడేపల్లిగూడెం రూరల్: మాధవరం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: మలేరియా నివారణ మాసోత్సవ అవగాహన కార్యక్రమం మంగళవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ఎన్జీవో కాలనీ, టి.వేమవరం, జంగంచెర్వు, డీఎల్‌కే రోడ్డు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్మోడియం, పరాన్న జీవి, ఫిమేల్ ఎనాఫిలస్ ఆడదోమ కాటు ద్వారా మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని అన్నారు. ఈ ఎనాఫిలస్ దోమలు మంచి నీటి నిల్వల్లో గుడ్లు పెడతాయని ముఖ్యంగా చెరువులు, వాడని నీటి బావులు, నీటి గుంటలు, లోతట్టు ప్రాంతాలు, కాలువలు, సిమెంట్ ట్యాంకుల్లో గుడ్లు పెడతాయని అన్నారు. 10 రోజుల్లోగా ఈ గుడ్లు దోమలుగా మారతాయని, ఈ దోమలు రాత్రి సమయంలో కుడతాయని స్పష్టం చేశారు. ఇంటి ఆవరణల్లో దోమ వికర్షకాలైన బంతి మొక్కలు పెంచుకోవాలని, దోమ తెరల్లో నిద్రించాలని, ఒంటి నిండుగా దుస్తులు ధరించాలని, వారానికోసారి ఇంటి పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మలేరియా నివారణ మాసోత్సవ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీలు కె.బేబీ కుమారి, కె.మార్తమ్మ, హెల్త్ అసిస్టెంట్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియాను తరిమికొట్టాలి

తాడేపల్లిగూడెం రూరల్: మలేరియాను సమాజం నుంచి తరిమికొట్టాలని మాధవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కే.వెంకట్ అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని మాధవరం, అప్పారావుపేట గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ గ్రామాల్లో చలి, జ్వరం వంటి లక్షణాలు కలిగిన వారిని ఆస్పత్రులకు తరలించి, మలేరియా నిరాధరణ పరీక్షలు చేయాలన్నారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్, లార్వా జనిత ప్రదేశాల్లో గంబూషియా చేపలను విడుదల చేయాలని సూచించారు. తద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా తాడేపల్లిగూడెం యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు, సీహెచ్‌వో రత్నరాజ్యం, ఆరోగ్య పర్యవేక్షకులు వి.మణి, అశోక్, ఆరోగ్య సహాయకులు భాస్కరరావు, ఇ.కాంతారావు, ఝాన్సీ, ఎంఎల్‌హెచ్‌పీ పి.రూత్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇరగవరం: విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఈవో ఏస్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు స్కూల్ పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు వినియోగించుకుని చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, మండల టీడీపీ అధ్యక్షుడు గోపిశెట్టి రామకృష్ణ, బొంతు శ్రీను, మండల మాజీ టీడీపీ అధ్యక్షుడు వేండ్ర నాగు, మాజీ జెడ్పీటీసీ చుక్కా సాయిబాబా, జనసేన, బీజేపీ నాయకులు ఎంఇవో–2 జీబివి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



తణుకు టౌన్: వేల్పూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న దృశ్యం



పెంటపాడు: అంగన్‌వాడీ కేంద్రంలో గాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ సుజాత

తణుకు టౌన్: పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కృష్ణకుమారి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న చిన్నారులకు వేల్పూరు అంగన్‌వాడీ కేంద్రంలో ధ్రువపత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ కృష్ణకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులతో పాటు బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గాడ్యుయేషన్ డే

పెంటపాడు: చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేందుకు పోషకాహారం తప్పని సరి అని పెంటపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత పేర్కొన్నారు. పెంటపాడు గ్రామంలోని 6119 అంగన్‌వాడీ కేంద్రంలో గాడ్యూయేషన్ డే పురస్కరించుకొని మంగళవారం ఐదేళ్లు నిండిన పలువురు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యా ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం మెండు

భీమవరం: ప్రస్తుత పరిస్థితిలో తినే ఆహారం, వాతావరణ కాలుష్యం, అనేక రకాల వత్తిడితో జీవిస్తున్న ప్రజలు యోగా సంపూర్ణ పరిష్కార మార్గమని యోగ శిక్షకుడు కలిగొట్ల గోపాలశర్మ అన్నారు. రవిశంకర్ గురూజీ, ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్, భారతీయ విద్యాభవన్స్, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో మంగళవారం యోగ, ధ్యానంపై అవగాహన సదస్సు, ర్యాలీ, నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని అన్నారు.విద్యార్థి దశ నుంచే చిన్నారులకు యోగ వ్యాయామంపై అవగాహన కల్పించాలన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా నాలుగు రోజులపాటు అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. హైస్కూల్ హెచ్ఎం జె సుధారాణి మాట్లాడుతూ మానసిక సిద్ధికి, ఆరోగ్య సంరక్షణకు యోగ ఎంతో ఉపకరిస్తుందన్నారు.


కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలూ అమలు చేయాలి




మాట్లాడుతున్న మామిడి దాన వర ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం కోతిబొమ్మ సెంటర్‌లోని కార్యాలయం వద్ద నిర్వహించారు. దాన వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల్లో భాగమైన కార్మిక, కర్షక, రైతు, కూలి, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, మహిళా రంగాలకు, దళిత, ఆదివాసీ, మైనార్టీలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు పరచాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి రాజకీయ వివక్షత లేకుండా సూపర్ సిక్స్ పథకాలు వర్తింపచేయాలని కోరారు. వెంకటేశ్వరరావు, జమ్మితార చంద్రశేఖర్, దేవాబత్తుల రాంబాబు, ఆదినారాయణ, వాసు, నమ్మి శ్రీనివాస్, చిన్ని రాము పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు





- పప్పు దినుసులదీ అదే దారి
- ప్రజలపై పెనుభారం

పెంటపాడు: కూరగాయల ధరలు ఆకాశాన్నంటి కొనుగోలు దారులకు చుక్కలు చూపిస్తున్నాయి. అన్ని రకాల కూరగాయలు, దుంపలు, ఆకుకూరల ధరలు చూసి కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. మంగళవారం వారపు సంతకు వచ్చి ఎన్నో రకాల కూరగాయలు తీసుకు వెళదామనుకున్న వినియోగదారులు వాటి ధరలు చూసి అవాక్కయ్యారు.దీంతో చేసేదేమీ లేక కొన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. ఏం కొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. కాయగాయల ధరలు రోజు రోజుకూ కొండెక్కుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలను చూస్తేనే ప్రజల గుండె గుభేలుమంటోంది. వాటి ధరలు ఒక్కసారిగా రెండింతలు పెరగడంతో ఏం కొనలేక పోతున్నామని వినియోగదార్లు అల్లాడుతున్నారు.టమాటా కిలో ధర రూ.80 పైనే పలుకుతోంది.

భగ్గుమంటున్న పప్పు దినుసుల ధరలు

పప్పు దినుసులు ధరలు కూడా భగ్గుమంటున్నాయి. ఎండాకాలం కారణంగా దిగుబడి లేదంటూ వ్యాపారులు అధిక ధరలకు పప్పు దినుసులు, కూరగాయలు విక్రయిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా కూరగాయలు, ఆకు కూరల దిగుబడి ఈ ఏడాది తగ్గిందని రైతులు అంటున్నారు. పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలం, పట్టణంలోని నుంచి కాకుండా దూబచర్ల, పుల్లలపాడు, నల్లజర్ల, ఆవపాడు, ద్వారకాతిరుమల, భీమడోలు, ఉంగుటూరు మండలంలోని మెట్టప్రాంతం నుంచి కూడా కూరగాయలు మార్కెట్‌కు వస్తుంటాయి. ఈ ఏడాది మార్కెట్‌కు తక్కువ సరుకు రావడంతో ధరలు అమాంతంగా పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. ఉల్లిపాయలు కిలో రూ.50 పలికింది. బంగాళాదుంపలు కిలో రూ.60, పచ్చిమిర్చి రూ.100, టమాటా రూ.90, ఒక ములక్కాడ రూ.10, బీరకాయల ధర రూ.80 పలికింది. దొండకాయలు, బెండకాయలు, క్యారెట్, వంకాయ ఇలా ప్రతి కూరగాయ ధర పెరిగిందని వినియోగదారులు అన్నారు. సూపర్‌బజార్లలోనూ ధరలు మండిపోతున్నాయి. చిత్తూరు, బెంగుళూరు, కర్నూలు, నుంచి కాయగాయలు దిగుమతి చేస్తుండటంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెప్పారు.